ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024
5
శ్రీకాకుళం



5న ఇచ్ఛాపురంలో లోకేష్ పర్యటన!

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఫిబ్రవరి ఐదో తేదీన ఇచ్ఛాపురంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిసింది. పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలు అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది. లోకేష్ పర్యటన ఉంటుందన్న ప్రాథమిక సమాచారం నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచనలతో టిడిపి నాయకులు ఎన్.జాని, వార్డు కౌన్సిలర్లు లీలారాణి, కె.దిలీప్ కుమార్, పి.తవిటయ్య, మణి తదితరులు మంగళవారం స్థల పరిశీలన చేశారు.

బదిలీల జోరు

- మూడేళ్ల సర్వీసు ఉన్న అధికారులకు స్థానచలనం
- ఒక్కొక్కరుగా కదలుతున్న పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు
- తహశీల్దార్ల బదిలీల్లో తాత్సారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోరుకు సమయం దగ్గర పడుతుండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియతో సంబంధం ఉన్న అధికారుల బదిలీల ప్రకియ జోరందుకుంది. మూడేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న జిల్లా, మండల అధికారులతో పాటు సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు స్థాన చలనం కల్పిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను ఈనెల 28న అమరావతిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేశారు. పోలీసు శాఖలో సిఐలు, ఎస్ఐలకు స్థానచలనం కల్పించారు. పంచాయతీరాజ్‌శాఖలో ఎంపిడిఒలనూ బదిలీ చేశారు. తహశీల్దార్ల బదిలీలకు సంబంధించి నేడో, రేపో జాబితాలు విడుదల చేయనున్నారు. సార్వత్రిక సంగ్రామానికి సంబంధించి తొలి అంకమైన ఉద్యోగుల బదిలీలు పూర్తి కావస్తుండడంతో ఎన్నికల వేడి మరింత పెరగనుంది.



ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులను జనవరి 31వ తేదీ లోగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకం. ఓటరు జాబితా తయారీ దగ్గర నుంచి ఎన్నికల ముగిసే వరకు వీరి పాత్ర అడుగడుగునా ఉంటుంది. రెవెన్యూ యంత్రాంగంలో ముఖ్య భూమిక పోషించే తహశీల్దార్ల బదిలీల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఎంపిడిఒలను బదిలీ చేసిన ప్రభుత్వం, తహశీల్దార్ల విషయానికి వచ్చేసరికి తాత్సారం చేయడంపై పలు సందేహాలకు తావిస్తోంది.

పైరవీల ప్రభావం

తహశీల్దార్ల బదిలీల్లో జోరుగా పైరవీలకు తెర తీసినట్లు ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. తమకున్న పలుకుబడి, అధికార పార్టీ నేతల అండతో నచ్చిన చోటుకు బదిలీ అయ్యేలా కొంతమంది చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్ జిల్లా బదిలీలు కావడంతో ముందుగానే అక్కడి పరిస్థితులను తెలుసుకుని, అనుకున్న చోటుకు బదిలీలు చేయించుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో ఉద్యోగుల బదిలీలు పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలో ఉంటాయి. అయితే బదిలీలు తయారు చేసే జాబితా మాత్రం ప్రభుత్వ అనుకూలంగా ఉన్న అధికారుల చేతిలో ఉండడంతో, వారి ద్వారానే పని చేయించుకుంటున్నట్లు తెలిసింది.

అమరావతిలోని రెవెన్యూ శాఖకు చెందిన ఓ కీలక మహిళా అధికారి బదిలీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని, జాబితాలను తారుమారు చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ఇద్దరు తహశీల్దార్లను వేరే చోటుకు పంపి, వారి స్థానంలో విశాఖ నుంచి ఇద్దరు తహశీల్దార్లను కలెక్టర్‌కు తెలియకుండా బదిలీ చేస్తూ భూపరిపాలనా కమిషనర్ శాఖ కార్యాలయం గట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు.

బదిలీల్లో జాప్యం వెనుక కారణం అదేనా?

తహశీల్దార్ల బదిలీల్లో జాప్యానికి పరిపాలనా సంబంధ కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెద్దఎత్తున జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ సాగుతోంది. తహశీల్దార్లను బదిలీ చేస్తే ఆ పనికి ఆటంకం కలుగుతుందని భావించిన ప్రభుత్వం, వారిని కొద్ది రోజుల పాటైనా ఉంచాలని అనుకున్నట్లుగా చర్చ నడుస్తోంది. తహశీల్దార్ల బదిలీల ప్రక్రియ పూర్తికి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు గడువు కోరినట్లుగా సమాచారం. ఎన్నికల కమిషన్ గడువు ఇస్తే, వీటితో పాటు అసైన్డ్ ల్యాండ్ పట్టాలకు పత్రాలు, ఇతర లక్ష్యాలనూ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అయితే అందుకు ఎన్నికల సంఘం అంగీకరించకపోవచ్చని అధికారులు చెప్తున్నారు.



నిరసన దీక్ష చేస్తున్న ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం

- ప్రత్యేక హోదా, విభజన హామీల అమల్లో విఫలం
- బిజెపికి భజన చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేన
- ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన నిరసన దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా అధ్యక్షులు జి.నర్సునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరి విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో చట్టబద్ధంగా ఇస్తామన్న ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. విభజన చట్టం ప్రకారం ఉమ్మడి ఆస్తుల పంపకాలు నేటికీ పూర్తి చేయలేదని చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తామని హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు.

ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీని విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, విభజన హామీల్లో పేర్కొన్న కేంద్ర విద్యాసంస్థలు నెలకొల్పాలని, వాటికి అవసరమైన నిధులనూ సమకూర్చాలన్నారు. విశాఖపట్నం-చెన్నై కారిడార్‌ను అభివృద్ధి చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

బిజెపికి భజన చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేన

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతు పలకడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన దూషించుకుంటాయని... ఈ పార్టీలు బిజెపి భజన చేస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం ఈ పార్టీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పల్లెత్తి మాట్లాడడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి, దానికి మద్దతు పలుకుతున్న రాష్ట్రంలోని పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జి.సింహాచలం, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కె.అప్పారావు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ఇసుక లారీలు అడ్డగింత

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని వంశధార నదీ పరివాహక ప్రాంతం చెవ్వాకులపేట ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలు చేసి విశాఖపట్నం తరలిస్తున్న లారీలను పొన్నాంపేట గ్రామస్తులు తమ గ్రామ రహదారిపై మంగళవారం అడ్డుకున్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిరసన తెలపడంతో ఇసుక ర్యాంపు నుంచి వచ్చిన లారీలతో పాటు ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వైపు వెళ్లే ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు నేతృత్వాన పోలీసులు అక్కడకు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. అనంతరం వారిని ఇసుక ర్యాంపు వద్దకు తీసుకెళ్లి ర్యాంపు సిబ్బందితో చర్చించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు, టిడిపి నాయకులు ఇప్పిలి రమణమ్మ మాట్లాడుతూ ఇసుక లారీ డ్రైవర్లు గుంతల రహదారిపై ఇష్టానుసారంగా నడుపుతుండడంతో తరచూ లారీలు బోల్తా పడుతుండడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక లారీల వల్ల పాడైన రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. లారీలపై టార్పాలిన్లు కప్పకుండా ఇసుకను తీసుకెళ్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై ర్యాంపు నిర్వాహకులు మాట్లాడుతూ యాజమాన్యం దృష్టికి గ్రామస్తుల సమస్యలను తీసుకెళ్తామని, ఇకపై ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని హామీనిచ్చారు.



గజమాలతో కలెక్టర్ దంపతులను సత్కరిస్తున్న జిల్లా అధికారులు

జిల్లాలో పనిచేయడం ఆనందం

ఆత్మీయ వీడ్కోలు సభలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాలో పనిచేయడం ఆనందంగా ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మున్సిపల్ పరిపాలన కమిషనర్‌గా బదిలీ అయిన ఆయనకు జిల్లా అధికారులు నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు పనిచేసినట్లు తెలిపారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమల్లో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. జిల్లాతో విడదీయరాని బంధం గురించి వివరించారు. తాను ఏ శాఖలో పనిచేసినా జిల్లాకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కలెక్టర్‌తో తనకున్న అనుబంధాన్ని ఎస్‌పి జి.ఆర్ రాధిక గుర్తుచేసుకుని ఆయన సేవలను కొనియాడారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కలెక్టర్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నట్లు చెప్పారు. ఎప్పట్నుంచో జిల్లాలో జరగని పనులు ఆయన సాధించినట్లు వివరించారు. తనతో ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. ఐటిడిఎ పిఒ కల్పన కుమారి మాట్లాడుతూ ఐటిడిఎ అభివృద్ధిలో తనవంతు సహాయ సహకారాలు అందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. సభలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వీడ్కోలు

బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు పలువురు నాయకులు, ఉద్యోగులు మంగళవారం వీడ్కోలు పలికారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబరులో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సత్కరించారు. కలెక్టర్‌గా శ్రీకేష్ లాఠకర్ జిల్లా ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నారని కృష్ణదాస్ అన్నారు. రెండున్నరేళ్లకు పైగా జిల్లాలో సేవలందించి ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలైన నవరత్నాల పథకాలు అమలు చేయడంలో, జిల్లాలో చేపట్టిన కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారని కొనియాడారు.

తప్పుడు కేసులతో ప్రజాధనం దుర్వినియోగం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



న్యాయస్థానాల్లో ఎన్నిసార్లు చీవాట్లు తిన్నా తప్పుడు కేసులతో ప్రజాధనాన్ని, అధికారాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దుర్వినియోగం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు నిరాధారమైనవని ఒక్కొక్కటిగా రుజువవుతోందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇసుక కేసుల్లో ఇప్పటికే కోర్టులో జగన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో చంద్రబాబు సఫలీకృతులయ్యారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చివరకు నిజం గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. సొంత కుటుంబం నుంచి విమర్శలు వచ్చినా తట్టుకోలేక ఎదురుదాడికి దిగుతున్న వైసిపి శ్రేణులు... అల్లరిమూకల కంటే అధ్వానంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. నాడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై, నేడు సొంత చెల్లెలు షర్మిలపై జగన్, ఆయన పార్టీ నాయకులు అనుసరిస్తున్న తీరు మహిళలు సిగ్గుపడే రీతిలో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి మహిళల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదని హెచ్చరించారు. సొంత పార్టీలోనే అసమ్మతి రగులుతోందని, అందుకే వేదికలపై వైనాట్ 175 అని చెప్పుకునే జగన్... మీడియా ముందు ఓడిపోయినా పర్వాలేదని అంటున్నారని తెలిపారు.

గ్రామ స్వరాజ్యం నిర్వీర్యం

- సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్
- కళ్లకు గంతలతో సర్పంచ్‌ల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ, గ్రామ స్వరాజ్యాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ విమర్శించారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామ స్వరాజ్య వ్యవస్థకు పూర్వ వైభవం కల్పించాలన్న డిమాండ్‌తో సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ అభియాన్ ఆధ్వర్యాన సర్పంచ్‌లు నగరంలోని గాంధీపార్కులో గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లకు విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య వ్యవస్థకు పూర్వ వైభవం కల్పించాలన్నారు. సర్పంచ్‌ల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్న సర్పంచ్‌ల ఆలోచనలపై జగన్ ప్రభుత్వం నీళ్లు చల్లి పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులను సైతం కొల్లగొడుతోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో సర్పంచ్‌ల వ్యవస్థకు మనుగడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం సర్పంచ్‌లకు కల్పించిన 29 అధికారాల విధులు, 16 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి లక్షలాది రూపాయలను వడ్డీలకు తెచ్చి అప్పులపాలయ్యామని, కొంతమంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వెంకట భానోజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి బి.అప్పలనాయుడు, సంఘ నాయకులు, సర్పంచ్‌లు కె.అదినారాయణ, బి.గౌరీపతిరావు, ఆర్.లక్ష్మీ రమణమూర్తి, బి.రామారావు, మూకళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

పక్కాగా పొగాకు ఉత్పత్తుల నిషేధం అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

జిల్లాలో పొగాకు ఉత్పత్తుల నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని ఎఎస్‌పిలు జె.తిప్పేస్వామి, టి.పి విఠలేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం, రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కాట్పా చట్టంలోని సెక్షన్-4 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారు, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా రాష్ట్రంలో ఏటా సుమారు 48 వేల మరణాలు సంభవిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. జువైనల్ చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం ఎవరైనా మత్తు కలిగించే పదార్థాలు పిల్లలకు ఇస్తే వారికి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా కూడా విధించబడుతుందని తెలిపారు.

పిల్లలను పొగాకు ఉత్పత్తులకు అలవాటు కాకుండా నిరోధించడం మన కర్తవ్యమన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో 'నో స్మోకింగ్' బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణా తరగతులు పోలీసు అధికారులకు చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందన్నారు. జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలో 13 నుంచి 15 ఏళ్ల వయసు వారిలో 33.6 శాతం మంది పొగాకు వినియోగదారులుగా ఉన్నారని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల ప్రాబల్యాన్ని తగ్గించడానికి వైద్యారోగ్య, విద్యాశాఖలు అన్ని జిల్లాల్లో పొగాకు రహిత విద్యాసంస్థ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. అనంతరం పొగాకు వ్యతిరేకంగా పోరాడతామని పోలీసు అధికారులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు వై.శృతి, ఎస్.వాసుదేవ్, విజయ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, పోలీసు, వైద్యాధికారులు, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెప్పినవన్నీ చేసిన ప్రభుత్వం

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస : ఎన్నికల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలన్నీ అమలు చేసిన తొలి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ మండల పరిషత్ ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన పిఎసిఎస్ నూతన భవనాన్ని పలాస కమ్యూనిటీ ఆసుపత్రిలో రూ.5.30 కోట్లతో నిర్మించిన రెండు అంతస్తుల అదనపు భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో పథకం అందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించే పరిస్థితి ఉండేదని, వైసిపి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో ఒక్క పైసా లంచం లేకుండా ఉన్న ఊరిలోనే అన్ని పథకాలూ అందిస్తున్నట్లు తెలిపారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబు నాయుడు ఎన్నికల నేపథ్యంలో మళ్లీ హామీలిస్తున్నారని, ఆయన ఎన్ని ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

ప్రోటోకాల్‌పై మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం

పలాస ప్రభుత్వాస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకంలో, ఆహ్వాన పత్రికలో ప్రోటోకాల్ ప్రకారం తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో మూలన తన పేరును చిన్నగా వేసి అవమానించారని కోపోద్రిక్తులయ్యారు. పట్టణ ప్రథమ పౌరునిగా కనీస మర్యాద పాటించలేదని, అస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా తాను ఉన్నా ఒక్క సమావేశానికీ ఆహ్వానించలేదన్నారు. మర్యాద లేని చోట తాను ఉండనని సభకు రాకుండా ఇంటికి వెళ్లిపోయారు.

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్

శ్రీకాకుళం అర్బన్ : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ పిలుపునిచ్చారు. నగరంలోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో విశ్వకర్మ పథకంపై మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. వృత్తి పనులు చేసుకుంటున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. 18 రకాలైన కుల వృత్తుల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి వీలుందన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.మూడు లక్షల రుణం పొందవచ్చని, ఐదు శాతం వడ్డీ చెల్లించి వృత్తిని మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. లీడ్‌బ్యాంకు మేనేజరు సూర్యకిరణ్ మాట్లాడుతూ ఈ పథకం శిక్షణకు హాజరైన వారికి మొదటి దశలో రూ.లక్ష రుణం పొందవచ్చని, 5 శాతం వడ్డీతో రుణం తిరిగి చెల్లించిన వారికి ఏడాది వ్యవధిలో రూ.రెండు లక్షల వరకు రుణం పొందడానికి వీలుందన్నారు. 18 ఏళ్లు దాటిన వారంతా తమ బ్యాంకు అకౌంట్ లింక్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ సమయంలో రూ.500 పారితోషికం ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరైన వారికి వారి వృత్తికి సంబంధించిన కిట్‌ను అందజేస్తున్నట్టు చెప్పారు. సదస్సులో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా పరిశ్రమల అధికారి ఉమామహేశ్వరరావు, బిసి సంక్షేమాధికారి అనురాధ, డిపిఒ రవికుమార్, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయం



ఆమదాలవలస : గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న బాలాజీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో గాంధీ చిత్రపటానికి పిసిసి ప్రధాన కార్యదర్శి పైడి నాగభూషణ రావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దేశేళ్ల గోవింద మల్లిబాబు, ఈకో రైల్వే మాజీ సలహాదారులు మంత్రి నరసింహమూర్తి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, కె.ప్రసాద్, టి.శాంతారావు, ఎస్.ధర్మారావు, జి.పి.నాయుడు, పి.రమేష్‌కుమార్, దాలినాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఒన్‌వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పిసిసి రాష్ట్ర అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డేపల్లి గోవింద గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, లఖినేని సాయిరాం, బొత్స రమణ, కూన సుందరరావు, గురుగుబెల్లి కృష్ణమూర్తి, అప్పారావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణ్‌రావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రమేష్‌సాహు, అధ్యాపకులు నాగేంద్ర రామకృష్ణ, లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు, విజయ, సంగీత, గౌతమి, విజయ్, తారాచంద్, కె.కమలాకరరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యానకళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.జయమన్మథరావు, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బి.ఎస్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం పాల్గొన్నారు. అనంతరం విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

కవిటి: గాంధీజీ ఆశయాలు ఆదర్శనీయమని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిందు మాధవి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వతంత్ర ఉద్యమంలో గాంధీ పాత్ర, దేశం కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టిన గాంధీ జీవిత చరిత్రను ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గాంధీ చిత్రపటానికి చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూర్తి, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి.లక్ష్మీనరసింహారెడ్డి, సెక్రటరీ తేజస్, ఎస్.పి.ఎల్.మాధవి, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, పద్మజ, శాంతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని నిమ్మాడ టిడిపి కార్యాల యంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నా యుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టెక్కలి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషు, టెక్కలి పట్టణ పార్టీ అధ్యక్షుడు లవకుమార్, మండలం తెలుగు యువత అధ్యక్షుడు కోళ్ళ కామేష్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గాంధీ చిత్రపటానికి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముణి రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డాక్టర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు, పిఒలు డాక్టర్ ఆర్.గణపతిరావు, డాక్టర్ బి.శ్రీధర్ పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే టిడిపి కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



టెక్కలి రూరల్ : ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఆడిటోరియం ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మంగళవారం ప్రారంభించారు. గతంలో సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రాహుల్‌కుమార్ రెడ్డి హయాంలో భవనం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమీపంలో ఉన్న వసతిగృహ విద్యార్థులకు ఈ గ్రంథాలయం వినియోగంలోకి వస్తుందని అన్నారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ ప్రవల్లికాప్రియ, కార్యాలయ ఎఒ రాజ్‌కుమార్, పద్మ, నంద, విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు కుప్పిలి కామేశ్వరరావు, జివి.రెడ్డి మాస్టార్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

జర్నలిస్టుల అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులున్న ప్రతిఒక్క జర్నలిస్టుకీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టెక్కలి ప్రెస్‌కబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ టెక్కలి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం ఆందించారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని సబ్ కలెక్టర్‌కు ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాత్రికేయులు ఎం.వి.రమణ, గనియా శ్రీనివాసరావు, పెద్దింటి పాపారావు, సుంకు గోపీనాథ్, భాస్కర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలను అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని దీనబంధుపురం పంచాయతీ కుడ్డబలో మంగళవారం వ్యవసాయ పరికరాలను స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పంపిణీ చేశారు. రైతులకు సబ్సిడీపై ఆయిల్ ఇంజిన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లను అందజేశారు. మండలంలో 236 మందికి వాటర్ షెడ్ పథకం ద్వారా విటిని అందించారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కోరారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వాటర్ సెండ్ పథకం ఎపిడి జయరామ్, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ కావేరి వెంకటేష్, పాపారావు, శశిభూషణరావు, తెంబూరు ప్రసాద్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డును రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయినేజీలను ప్రారంభించారు. అలాగే సీపన్నాయుడుపేటలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయినేజీని సైతనం ప్రారంభించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కుట్ర

వ్య.కా.స
జిల్లా ప్రధాన కార్యదర్శి
సింహాచలం

ప్రజాశక్తి- గార

పేద ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటుగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కొత్తకొత్త నిబంధనలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తూ కూలీని తగ్గించేందుకు కుట్రచేస్తోందని, అందులో భాగంగానే ఉపాధి చెల్లింపులకు కొత్తగా ఆధార్ ఆధారిత విధానాన్ని తీసుకొచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి గంగరాపు సింహాచలం విమర్శించారు. గార మండలం సతివాడలో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త సంవత్సరం తొలి రోజు నుంచి అమలులోకి తీసుకొచ్చిన ఆధార్ ఆధారిత ఉపాధి హామీ వేతన చెల్లింపుల విధానం పేదలకు అన్యాయం చేసేదిగా ఉందన్నారు. దాదాపు ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి తీరు దుర్మార్గమన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా యుపిఎ ప్రభుత్వం హయాంలో అమలులోకి వచ్చిందన్నారు. ఆహార భద్రత హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆధార్ ఆధారిత ఉపాధి హామీ వేతనాల చెల్లింపు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ, శిర్ల మంగమ్మ, ఎర్ర అప్పారావు, లక్ష్మణరావు, పెయ్యల రాజేశ్వరి, కిర్రి రాములమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింహాచలం



సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ఫణీంద్రకుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళిలో ఎంపిడిఒగా పనిచేసి విజయనగరం జిల్లాకు బదిలీ అవుతున్న కుప్పిలి ఫణీంద్రకుమారే మా అందరి స్ఫూర్తి అని మండలంలోని సిబ్బంది అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఫణీంద్రకుమార్‌కు మంగళవారం వీడ్కోలు చెబుతూ సన్మానించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో రాజకీయాలకు అతీతంగా ఒకే తాటిపై నడిపించిన అధికారి పణీంద్రకుమార్‌యని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్, గృహ నిర్మాణశాఖ ఎఇ రెడ్డి పాపినాయుడు, హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేరాడ వెంకటరావు, కవిటి రామరాజు, బమ్మిడి గణపతిరావు, సచివాలయ కార్యదర్శులు చైతన్య, నరేష్, పినకాన నిర్మల పాల్గొన్నారు.

నియోజకవర్గ నేతలు ఒకేచోట ప్రచారం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ రాజకీయాల్లో ఇద్దరు శత్రువులు. ఆది నుంచి ఒకరిపై ఒకరు మాటల తుటాలు పేల్చుకునేవారు. అటువంటి ఇద్దరు నాయకులు ఒకే గ్రామంలో ప్రచారం నిర్వహించడం రాజకీయ విశ్లేషకులలో ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని రావివలసలో మంగళవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఇంటింటా ప్రచారం చేపట్టి కూడలిలో సభ నిర్వహించారు. ఇదే సమయంలో వైసిపి టెక్కలి నియోజకవర్గం అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా రాత్రి రావివలసలో ప్రచారం చేపట్టడం గమనార్హం. ఇంటింటా ప్రచారం చేపట్టి వైసిపి విధానాల్ని ఎండగడుతూ అచ్చెన్నాయుడు ప్రచారం చేస్తే... రావివలస సర్పంచ్ సర్లన బాలకృష్ణ ఇంట్లో దువ్వాడ శ్రీనివాస్ వైసిపి కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇరువురు నేతలు ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకునే ఈ నేపథ్యంలో ఒకే గ్రామంలో ప్రచారం చేపట్టడం రాజకీయ విశ్లేషకుల్లో ప్రాధాన్యత చోటుచేసుకుంది. ఎన్నికల కోడ్ అమలు కాకముందే ఇరువురు నాయకులు ప్రచారాల్లో తమ బాణీని చేపట్టడం గమనార్హం.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందిగాం : మండలంలోని రౌతుపురం, శివరాంపురం, వల్లభరాయడుపేట గ్రామాల్లో ప్రకృతి పద్ధతుల్లో వ్యవసాయం సాగు అవుతుందని యూనిట్ ఇన్‌ఛార్జిలు లోకేష్, బాలకృష్ణ, అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బెండి గోవిందరావు పొలంలో ప్రకృతి పద్ధతిలో కూరగాయల పంట సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి పద్ధతిలో పండించిన పంటలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని తహశీల్దార్ వై.వి.పద్మావతి అన్నారు. కార్యక్రమంలో గోవింద, ఆదినారాయణ, బాబూజీ, రజని పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న వెంకటరమణ

విశ్రాంత అధ్యాపకుని ఔదార్యం

ప్రజాశక్తి- కవిటి

విశ్రాంత వృక్షశాస్త్ర అధ్యాపకుడు ప్రగడ వెంకటరమణ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రస్తుతం వృక్ష శాస్త్రం చదువుతున్న 61 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను సోమవారం అందించారు. తన తల్లి ప్రగడ బుచ్చమ్మ జ్ఞాపకార్థం కాలేజీ టాపర్‌తో కలిసి మరో 8 మంది విద్యార్థులకు రూ.15వేలు నగదు బహుమతి అందించారు. వృక్షశాస్త్రం చదువుతున్న 61 మంది విద్యార్థులకు రూ.5 వేలు విలువైన స్టడీ మెటీరియల్స్‌ను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు, ఉషోదయ యువజ న సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఆరింగి మధు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బెందాళం రమేష్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

బూర్జ : మండలంలోని కొల్లివలసలో ఉన్న ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని సూచించారు ప్రవేశ పరీక్ష మార్చి నెల 10న నిర్వహిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్ష ద్వారానే విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు.



సన్మానిస్తున్న ఈశ్వరరావు

లక్ష్మీనరసింహంకు అభినందనలు

రణస్థలం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. ఎచ్చెర్ల బిజెపి క్యాంప్ కార్యాలయంలో విజయనగరం లోక్‌సభ కన్వీనర్‌గా ఇటీవల నియమితులైన సంబర లక్ష్మీనరసింహంను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన అభినందిం చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను, జిల్లా కార్యదర్శి మన్నె సురేష్‌కుమార్, ఎస్‌సి మోర్చ అధ్యక్షులు టొంపల అప్పలరాజు, టీచర్స్ సెల్ కన్వీనర్ మన్నె కృష్ణానందం, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు గురాల రఘునాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందాస్, త్రినాథరావు, మండల ఉపాధ్యక్షు లు వెలిచేటి చినమౌళి, మండల సెక్రటరీ వాళ్లే రమణ, చినబాబు, కోటేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

3న రణస్థలం మండల సమావేశం

రణస్థలం : ఈ నెల 3న రణస్థలం మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఆర్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం అర్బన్ : రోడ్లపై వాహనం నడిపేటప్పుడు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ హరికృష్ణ సూచించారు. నగరంలోని ఏడు రోడ్డు లు కూడలి వద్ద మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవర్‌లో లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్‌లు, చిన్నవయసులో వాహనాలు నడుపు తున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధన పాటించకపోతే వచ్చే ప్రమాదాలను వారికి వివరించా రు. పరిమిత స్పీడ్‌లో వాహనాలు నడపాలని, హెల్మెట్ వాడకం తప్పనిసరని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ



చెత్త బుట్టలను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

ఎపిని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆశయాన్ని నిలబెట్టాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడిచెత్త, పొడిచెత్త ఏరివేతకు అవసరమైన బుట్టలను పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛమైన జీవనం అలవాటు చేసుకోవాలని, అందుకు ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తబుట్టలను వినియోగించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ గ్రామాల్లో ఇప్పటికే ఉద్యమంగా నడుస్తుందని చెప్పారు. ప్రతి ఇళ్లు, పరిసర ప్రాంతాలు, గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాయకులు వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, గార రమణ, పెద్దింటి రవి పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి పాలించే నైతిక హక్కుని కోల్పోయిందని, రాష్ట్ర ప్రజలు టిడిపి వైపే చూస్తున్నారని రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని రావివలస పంచాయతీ పరిధిలోని రావివలస, చిన్ననారాయణపురం, దామోదరపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. రాష్ట్రంలో ప్రజారంజకమైన పాలన లేదన్నారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. వాస్తవాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తు దాడులు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, హనుమంతు రామకృష్ణ, ఎల్.ఎల్.నాయుడు, బోయిన గోవిందరాజు, లమ్మత లక్ష్మి, మెండ దమయంతి, పోలాకి షణ్ముఖరావు, చాపర గణపతి పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న అచ్చెన్నాయుడు

నరసన్నపేట: మాజీ సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానికం వీరన్నాయి డు కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి జి.చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- కొత్తూరు

పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన మందులు జనరిక్ షాపులో లభిస్తాయని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయ సముదాయంలో ప్రధానమంత్రి జనరిక్ మందుల షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నాలుగు షాపులు మంజూరు కాగా, ఇక్కడ ప్రప్రథమంగా ప్రారంభించామని తెలిపారు. సిఎం జగన్ చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ జనరిక్ షాపు మంజూరైందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, మార్కెట్ కమిటీ చైర్మన్ సారిపల్లి నిరోష, సర్పంచ్‌లు పి.కృష్ణవేణి, కె.రత్నాలు, పి.సాధుబాబు, కలమట రమేష్‌బాబు, సంతోష్‌కుమార్, కె.వైకుంఠరావు, ఎం.చక్రపాణి రాజులునాయుడు, జి.నాగేంద్ర, మెళియాపుట్టి జెడ్‌పిటిసి గూడ మెండయ్య, డిప్యూటీ సహకార అధికారి కె.మురళీకృష్ణ, ఎస్‌డిఎల్ఎం జనరల్ మేనేజర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఆదాయం మిన్న... అభివృద్ధి సున్నా

ఇదీ నారాయణవలస వారపు సంత దుస్థితి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలో పెద్దదైన సంత మండలంలోని నారాయణవలస. ఈ వారపు సంత నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు తదితర పశువులను ప్రతి గురువారమూ సంతకు అమ్మకాలు, కొనుగోలు కోసం తీసుకొచ్చారు. కానీ పశువులకు, మనుషులకు తాగేందుకు తాగునీరు లేక విలవిలలాడుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు సంతలో లేకపోవడంతో మండు టెండలో, వర్షం పడితే వర్షంలో క్రయ విక్రయాలు చేపట్టాల్సి వస్తోంది. క్రయవిక్రయాల కోసం వచ్చిన పాడిరైతుల వద్ద నుంచి పెద్ద ఎత్తున అశీలు వసూళ్లు చేస్తున్నారు. కానీ, కనీస సౌకర్యాలు కల్పించలేదని పాడిరైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సంత ఆవరణలో కనీసం రేకుల షెడ్ కూడా నిర్మించకపోవడంతో జీవాలను తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట తదితర మండలాలకు చెందిన రైతులు ప్రతి గురువారమూ ఇక్కడికి వస్తుంటారు. ప్రతివారమూ మూడు నుంచి ఐదు వేల జీవాలు అమ్మకాలు, కొనుగోలుతో సుమారు రూ. 50 లక్షలు వరకు లావాదేవీలు ఉంటాయని స్థానికులు వివరిస్తున్నారు. ఈ సంత ద్వారా కోటబొమ్మాళి మండల పరిషత్‌కు, నారాయణవలస పంచాయతీలకి ఏటా రూ. 40 నుంచి రూ. 80 లక్షలు వరకు ఆశీల ద్వారా ఆదాయం వస్తుంది. అయితే సంబంధిత అధికారులు గాని, పాలకులు కాని ఈ సంత వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఈ పశువుల సంతపై దృష్టిసారించి కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.




మూలకు చేరిన తాగునీరు బోరు

చంద్రబాబుపై తప్పుడు కేసులతో ప్రజాధనం వృథా

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస



మాజీ సిఎం చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కోర్టు మొట్టికాయ వేసిందని, ఎన్నిసార్లు కోర్టులో ఎదురుదెబ్బలు తిన్నా ప్రభుత్వానికి బుద్ధిరాదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వ్యాఖ్యానించారు. పలాసలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న వైసిపి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఓ చెంపపెట్టుగా ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ సిఎం జగన్ ప్రభుత్వ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపిపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు.. పార్టీలో జగన్ తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు.

25 మంది రక్తదానం

జి.సిగడాం: మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా ఆనందపురంల పొగిరి వీధి యువకులు రెడ్‌క్రాస్ సమక్షంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు 25 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిహెచ్.మోహన్ మాట్లాడుతూ రక్తం అందక ఎవ్వరూ చనిపోకూడదనే ఉద్దేశంతో యువకులు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆనందపురం యూత్ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గార అప్పలనాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిత్తిరి రాజు, గౌరినాయుడు, నారాయణరావు, రమణ, రెడ్‌క్రాస్ నుంచి చైతన్య పాల్గొన్నారు.



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ మోహన్

రామ్‌మల్లిక్‌నాయుడు పరామర్శ

లావేరు : టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌వ ల్లిక్‌నాయుడు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పలువురిని పరామర్శిం చారు. అదపాకకు చెందిన టిడిపి నాయకులు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఎంపిటిసి పల్లంటి రామచంద్రరావు ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన రామచంద్రరావును, మరో కార్యకర్త కిల్లారి పైడినాయుడును పరామర్శిం చారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల రమణ, పి.మధుబాబు, చార్లెస్ ఉన్నారు.



ధ్రువపత్రాలను అందుకున్న ఎంపికైన అభ్యర్థులు

జాబ్‌మేళాకు స్పందన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగ ళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. కళాశాల జెకెసి కెరీర్ గైడెన్స్, విశాఖపట్నానికి చెందిన నిర్మాన్ ఆర్గనైజేషన్ల ఆధ్వర్యాన నిర్వహించిన ఈ జాబ్‌మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ప్రారంభించారు. పది కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాలో 83 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయి. నిరుద్యోగుల అర్హతను బట్టి ఎంపిక చేసిన ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను ప్రిన్సిపాల్ అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జెకెసి కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, కె.శ్రీధర్, నిర్మన్ కో-ఆర్డినేటర్ జి.కనవయ్య, శంతన్‌కుమార్, గిరీష్, తిరుమల, భవాని పాల్గొన్నారు.

'108'లో గర్భిణి ప్రసవం

పలాస : మండలం కొండలోగాం పంచాయతీ లింబుగాంకు చెందిన సవర జ్యోతి 108లో ప్రసవించింది. జోతికి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. అంబులెన్స్ హుటాహుటిన చేరుకుని గర్భిణిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కైజోల గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువ కావడంతో మార్గంమధ్యలోనే ఇఎంటి జి.శంకర్, పైలట్ వి.మురళీమోహన్ ప్రథమ చికిత్స నిర్వహించారు. దీంతో జ్యోతి పండింటి ఆడబిడ్డకు జన్మనించింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.


శ్రావణిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలేజ్ విద్య జీవితాన్ని మలుపు తిప్పే సమయమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉత్తమ క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కష్టపడి చదవాలని విద్యార్థులను కోరారు. శారీరకంగా, మానసికంగా విద్యార్థులు నియంత్రణలో ఉండాలని, విచక్షణతో వ్యవహరించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రావణికి అధ్యాపకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ పట్నాయక్, అధ్యాపకులు రుప్పు సుందర్, తిరుపతి, శోభారాణి, ప్రధానోపాధ్యాయులు హరిబాబు, తరకేశ్వర పండా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'అన్నా క్యాంటీన్'కు రూ.15వేలు వితరణ

కోటబొమ్మాళి: స్థానిక టిడిపి ఆవరణలో పేదల కోసం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు విజయవాడకు చెందిన చెరుకూరు జగదీష్ మంగళవారం రూ. 15 వేలును వితరణగా అందజేశారు. అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు రూ.5లకే భోజనం అందించే నేపథ్యంలో క్యాంటీను కావాల్సిన సామగ్రిలో భాగంగా రూ.15 వేలు విరాళంగా అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మీనాక్షిని సన్మానిస్తున్న వాకర్స్

నడకతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి వ్యక్తీ ఆరోగ్యవంతంగా జీవించాలంటే నడక తప్పనిసరని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. కలెక్టరేట్ రోడ్డులోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఆదిత్య వాకర్స్ క్లబ్ 21వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో వ్యాయామానికి సమయం కేటాయించాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం 30 నిమిషాలు నడవడం వల్ల శరీరంలోని అనేక రకాల రుగ్మతల నుంచి బయటపడవచ్చన్నారు. అనంతరం డిఎంహెచ్ఒను సన్మానించారు. కార్యక్రమంలో ఆదిత్య వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, గవర్నర్ జామి నారాయణస్వామి, అధ్యక్షులు బురిడి గౌరీశంకర్, జి.ఆర్.జి.నాయుడు, ప్రభాకర్ పట్నాయక్, పోలుమహంతి, సాయి, సుజాత, కొంక్యాన మురళీధర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పల్లె పల్లెకు టిడిపి

పలాస : రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని పెదంచల, మున్సిపాలిటీ పరిధిలో 14, 29 వార్డుల్లో పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసిపి నాయకులకు భయపడాల్సిన అవసరం లేదదని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో దువ్వాడ సంతోష్‌నాయుడు, పోలాకి పాపారావు, పి.ధనుంజయ, నారాయణ, ఢిల్లీ, ధర్మారావు, శంకర్, ధర్మానరావు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న విజయ

భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సోంపేట

మండల కేంద్రం సోంపేటలో నూతనంగా నిర్మించనున్న విజయ దుర్గ మోటార్ యూనియన్ నూతన భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, వైస్ ఎంపిపి గుంట్రాల శ్రీను, సర్పంచ్ నగిరి ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాథం, మండల వైసిపి అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, జెసిఎస్ అధ్యక్షులు బుద్దాన శ్రీకృష్ణ పాల్గొన్నారు.

టిడిపి పలువురి చేరిక

ఆటో లగేజీ టాక్సీ యూనియన్ సభ్యులు టిడిపి నుంచి వైసిపిలోకి చేశారు. వీరికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా యూనియన్ల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. పార్టీలో చేరిన వారు గార ప్రతాప్, గేదెల ప్రతాప్, జి.సంతోష్, జి.శ్యామ్, పి.సురేష్, బి.శంకర్, బి.శేఖర్, పి.కాళి, బి.లక్ష్మణరావు, ఎస్.సోమేష్, జి.ధనుంజయరావు ఉన్నారు.

సిఎం జగన్ మహిళా పక్షపాతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు మహారాణులని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరులో వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యనాయుడు అధ్యక్షతన ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ మాట మీద నిలబడిన వ్యక్తి అన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు అవకాశం ఇస్తే రైల్వేస్టేషన్‌లో స్టీలు బెంచీలు మాత్రమే ఏర్పాటు చేసి బెంచీలు నాయుడుగా పేరు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి శిరీష తాను స్వాతంత్ర్య సమరయోధులు కుటుంబం నుంచి వచ్చానని చెబుతూ... దివాళా కోరు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, సర్పంచ్‌లు నర్తు లక్ష్మీనారాయణ, గూడ ఈశ్వరరావు, అట్టాడ గోపి పాల్గొన్నారు.


నరసన్నపేట : చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట : ఆసరా, చేయూత, ఇళ్ల పట్టాలు, దిశ చట్టం, మహిళా రిజర్వేషన్ వంటి ఎన్నో కార్యక్రమాల్లో మహిళలను భాగస్వామ్యం చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉర్లాంలోని నాలుగో విడత ఆసరా నమూనా చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం చంద్రబాబు నాయుడు పాలనా కాలంలో మహిళలను మోసం చేసిన ఘనత ఆయనదైతే, మహిళలకు అన్నింటా పెద్దపీట వేసిన ఘనత సిఎం జగన్ అని పేర్కొన్నారు. బిసి సెల్ జోనల్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, రాజాపూర్ హైమావతి, సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, ఎపిఎంలు, సిసిలు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లు ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును అందజేశారు. మండలంలోని 1523 మహిళా సంఘాలకు రూ.10.60 కోట్లు నాలుగు విడత రుణ


వజ్రపుకొత్తూరు : నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

మాఫీ వర్తించిందని అన్నారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి మెరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ అధ్యక్షుడు కెళ్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపిలు నక్క చింతామణి, పి.తులసమ్మ, నందిగా ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక ఉన్నత పాఠశాలలో నాలుగో విడత ఆసరా నమూనా చెక్కును జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, వైస్ ఎంపిపి గుంట్రాల శ్రీను, సర్పంచ్ నగిరి ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాథం, మండల వైసిపి అధ్యక్షులు శిలగాన భాస్కరరావు పాల్గొన్నారు.


నౌపడ : నమూనా చెక్కును అందజేస్తున్న నాయకులు

టిడిపిలో పలువురి చేరిక

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేశారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం పంచాయతీకి చెందిన సుగ్గు రమేష్, ఆయన అనుచర కుటుంబాలు, టెక్కలి మండలం లింగాలవస పంచాయతీ సన్యాసిపేట నుంచి జెన్ని లచ్చయ్య, సింగువలస సింహాచలం, పున్నయ్య, జన్ని మనోజ్‌కుమార్, మధు, దిలీఫ్, వెంకటేష్, దుర్గారావు, మధు తదితర 25 కుటుంబాలు, సంతబొమ్మాళి మండలం మూలపేట పంచాయతీ విష్ణుచక్రం గ్రామానికి చెందిన జీరు బాబూరావు, జీరు శ్యామలరావు, గిన్ని శ్రీనులు చేరారు.

సోంపేట: మండలంలోని బారువా పంచాయతీ


కోటబొమ్మాళి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సమక్షంలో 70 కుటుంబాలు మంగళవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలోకి చేరిన వారిలో మహేష్ మాస్టర్, దున్న సత్యం, కర్రి కామేష్, నరసింహమూర్తి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దిల నాగేష్, సిహెచ్.శ్రీను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మడ్డు గురుమూర్తి, మడ్డు కుమార్, రాజేష్ ఖన్నా, సూర్యనారాయణ, జోగారావు పాల్గొన్నారు.

యువత గాంధీ మార్గంలో నడవాలి


విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న విఠలేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు, ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం మంగళవారం నిర్వహించిన మూడో వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయులు అని కొనియాడారు. గాంధీజీ అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, సురంగి మోహనరావు, నిక్కు అప్పన్న, మహీబుల్లా ఖాన్, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, బెజ్జిపురం ప్రసాదరావు, గ్రీన్‌సిటీ అధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బిపి, సుగర్, కిడ్నీ పరీక్షలు ఇసిజి వంటి పరీక్షలు ఉచితంగా చేసినట్లు తెలిపారు. నిపుణులైన


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్యులతో రోగులకు పరీక్షించి అవసరమైన సూచనలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గొరకల విశ్వనాథం, వైద్య సిబ్బంది సన్యాసిరాజు, తేజ్యం, తేజా లలిత పాల్గొన్నారు.

పోషక జీవన ఎరువుల తయారీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న చిరంజీవిరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

చెరకు పంట వ్యర్థాలతో మేలైన పోషక జీవన ఎరువును తయారు చేయవచ్చునని ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో సర్పంచ్ ప్రతినిధి సోమరాజు తేజేశ్వరరావు అధ్యక్షతన పోషక జీవన ఎరువు తయారిపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చెరకు పంట బెల్లం తయారీ విధానంలో వచ్చే వ్యర్థాలు, అవశేషాలతో నేలకు పోషకాలు అందించే జీవన ఎరువును ఎలా తయారు చేసుకోవాలో రైతులకు వివరించారు. 200 లీటర్ల జీవామృతంతో తక్కువ ఖర్చుతో భూమిని సారవంతం చేయవచ్చునని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని బుడ్డెపుపేటలో నివాసం ఉంటున్న కొంతాల గాయత్రి బోన్ కేన్సర్‌తో బాధపడుతుంది. ప్రస్తుతం ఆమె ఏలూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్స్‌బులిటీ ఆర్గనైజేషన్ తరపున వైద్య ఖర్చు నిమిత్తం రూ.పది వేలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ధనుష్, రంగ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ ఎడి సుబ్రహ్మణ్యం

జంతువులను సంరక్షించాలి

సరుబుజ్జిలి : విద్యార్థులు జంతువులపై ప్రేమాభిమానాలు చూపించి వాటిని సంరక్షించాలని వెటర్నరీ ఎడి సిహెచ్.సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని వెన్నెలవలస గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాలలోని 9వ తరగతి పిల్లలకు జంతు సంక్షేమం గురించి మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉమ, ఉపాధ్యాయులు రత్నకుమారి పాల్గొన్నారు.

లావేటిపాలెంలో అన్నదానం

లావేరు : లావేరు పంచాయతీ లావేటిపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అన్నదానం నిర్వహించారు. లావేరు, కేశవరాయపురం, జి.జి.వలస, సీతావలస, అప్పాపురం, వెంకటాపురం, గురుగుబిల్లి, సుభద్రపురం, బొడ్డపాడు, తాళ్లవలస, రావివలస గ్రామానికి ఐదు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. ముందుగా ఆలయం వద్ద చిన్నారులతో నిర్వహించిన కోలాటం అందరినీ అలరించింది.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

వజ్రపుకొత్తూరు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టబడి చదవాలన్నారు. రోజూ నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలు విద్యార్థులు రాయాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య పర్యవేక్షణలో విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం చేయాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈమెతో పాటు ఎంఇఒ దశరథ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న పగడాలమ్మ

ఐటిఐ సందర్శన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న, 9,10 తరగతుల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు డి.నాగభూషణం ఆధ్వర్యాన షిర్డీసాయి ఐటిఐ కళాశాలను సందర్శించారు. ఉన్నత చదువుల్లో భాగంగా భవిష్యత్ చదువుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునే క్రమంలో తీసుకోవాల్సిన కోర్సులు వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటిఐ కరస్పాడెంట్ సత్తారు మన్మథరావు, వృత్తి విద్య ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ, బి.రవికిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి పాల్గొన్నారు.


సరుకులను అందిస్తున్న సభ్యులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంక పంచాయతీ బొగిడియపుట్టుగకు చెందిన బోగిడియ నీలమ్మ కుటుంబానికి ఉద్దానం యూత్ ఆధ్వర్యాన మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అసిరిపోలమ్మ అమృత కలశం కార్యక్రమంలో భాగంగా ఈ సరుకులు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు దీనబంధు తెలిపారు. యూత్ క్లబ్‌కు చెందిన ప్రముఖ శిల్పి బైరి తిరుపతి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ధి సతీష్ కుమార్, క్లబ్ గౌరవ సభ్యుడు విజయ గోపాల్, క్లబ్ ఉపాధ్యక్షుడు కాళిదాస్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం వంశీకృష్ణ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మెళియాపుట్టి : పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించాలని ఎఎంఒ గుంట లక్ష్మీనారాయణ అన్నారు. మెళియాపుట్టిలోని ఎంపిపి స్కూల్, కెజిబివి పాఠశాలలను మంగళవారం సందర్శించారు. టెస్ట్ పుస్తకాలను తరువుగా చదివి సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురు ఎంపిక

మెళియాపుట్టి : మండలంలో ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని మండలంలోని కోసమాల ఉన్నత పాఠశాలకు ఎం.లిఖితేష్, రోనాక్ మజ్జి, కె.గోపీచంద్, సలాణ వర్షిని ఎంపిక కాగా, జాడుపల్లి, మెళియాపుట్టి మరో ఇద్దరు ఎంపికయ్యారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కుష్టు అంటువ్యాధి కాదు

కవిటి: 'కుష్టు' అంటువ్యాధి కాదని రాజపురం పిహెచ్‌సి వైద్యాధికారులు శశిధర్, మౌనిక అన్నారు. రాజపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులతో కలిసి మంగళవారం కుష్టు వ్యాధిపై గ్రామంలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కుష్టు అనేది ఒక బాక్టీరియా ద్వారా వ్యాపించే వ్యాధని, ప్రారంభ దశలోనే దీన్ని గుర్తిస్తే పూర్తిస్థాయిలో అంగ వైకల్యం లేకుండా నయమవుతుందని అన్నారు. ఈ వ్యాధి ప్రారంభ దశలో శరీరంపై ఎర్రని రాగి రంగులో మచ్చలు వస్తాయని, స్థానిక ప్రభుత్వ వైద్యుల ద్వారా దీనికి చికిత్స తీసుకోవాలని అన్నారు. కుష్టు వ్యాధికి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారని, ప్రజలు అవగాహన ద్వారానే ఈ వ్యాధి రాకుండా చూసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఎంపిటిసి ఎస్.కృష్ణారావు, ఆస్పత్రి ఎఒ అభిమన్యు సోయి, కేశవరావు పాల్గొన్నారు.

సత్తా చాటిన క్రీడాకారులు

సీతంపేట: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ టోర్నమెంట్లో సీతంపేట మండలం క్రీడాకారులు సత్తాచాటారు. బుధవారం నుంచి జరగబోవు జిల్లాస్థాయి ఆడుదామాంధ్ర టోర్నమెంట్‌కు ఎంపికైన ఈ జట్టు క్రీడాకారులను, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఎన్.జాకబ్‌దయానంద్‌ను ఎంపిడిఒ కె.గీతాంజలి అభినందించారు. దోనుబాయి సచివాలయం షటిల్ బ్యాట్మెంట్ సత్తా చాటారు. క్రికెట్లో ధారపాడు సచివాలయం, ఖోఖోలో గోయిది సచివాలయం జట్లు విజయం సాధించాయి. వాలీబాల్‌లో పుబ్బడ సచివాలయం జట్టు, బాలికల వాలీబాల్‌లో కడగండి సచివాలయం జట్టు విజయం సాధించారు.